# కుండలేగదా మార్నాయ్!

ఈమద్దె ఒకనాడు తూర్పున పటం ఎగరగముందే కండ్లు నులుముకుంటా నిద్దర లేచినా. పాలుమారిగ్గా ఉంటే పడక మిందనే కూసోని నీలగతా ఎదురుంగా గోడకు యాలాడ్తా ఉండే వెంకటేశ్వరుడి పటానికి దణ్ణంగూడా పెట్టుకుణ్ణా. అన్ని కాపీనీళ్లు గొంతులో పడ్తాయని ఎదురు చూస్తా ఉండా.

''నువ్వు లెయ్ లేదనే నేనూ ఎదుర్సూస్తా ఉండానే!'' అన్నెట్టుగా మా బాశాలి దండకం ఎత్తుకుండె.

''దానెమ్మా నాయాలి సీమ! నా గొంతులో కన్ని కాపీనీళ్లిచ్చి మల్ల గావాలంటే మల్లుకోవచ్చు గదా ఈ దండకాల్తో?'' అని అన్నానో లేదో-

''కొంపలో రోన్ని మంచి నీళ్లుంటే ఈ ఏడుపు ఎందుకంట?'' అనె.

''కాదు కాదే! నీ మాటకే వస్తా . యాడైనా ఎవురైనా కొంపలో పాల చుక్క లేదంటారేమో గానీ నీళ్ల చుక్క లేదంటారా?'' అని నా సందేహాన్ని మింగలేక కక్కేకుందికి-

''రాయలసీమ సిన్నోణ్ణి!'' అంటా రాగాలు తీస్తే సరిపోదే బతుకు. బతకతా ఉండేది యాడ?'' అంటా మా బాశాలి మెత్తగానే అంటించె.

''అవునుగదా? అట్టా యిట్టా కూడా కాని బతుకులు రాళ్లసీమలోనే గదా? అని అనుకుండే కుందికి మాబాశాలి మాట నసాళాని కెక్కె. ఆడికి ఊరుకోనుంటే సరిపొయ్యేది.

''ఇంటి ముందర్నే ఉండాది గదా బోరింగు!''

నా నోట్లో మాటట్టా మాటగా ఉండంగానే మలేసుకుణ్ణింది చూడండి మహన్నబావుల్లారా! అప్పులోడు వొకిదంగా మేలు గదా? గుడ్డేసింది కంప మిందగదాని

కాసింత లొక్కెం ఉంటింది. మా యింటామెకు అదెంతా ఏమీలే. ఎనుకూముందు చూసే పనేలే! అయినా సంసారం గుట్టంటారు. గుట్టూలే. మట్టూలే. గులాపోణ్ణి గుట్టు రట్టు చేస్తా ఉండా.

''ఎట్టెట్టా? ఇంటి ముందర్నే ఉండాదా బోరింగు? అరెరే! మాకు తెల్నే తెల్దే. మా బోటోళ్లనే కండ్లుండీ గుడ్డోళ్ల అంటారేమో? అయినా నువ్వేం మొగోడయ్యా? కొళాయిలో నీళ్ల రాలేదంటా వుంటే యింటి ముందర్నే బోరింగు ఉండాదంటావే? ఇంట్లో ఎంత మంది ఉండారని? ఇద్దరూ ఆడ పిలకాయిలు. ఒక పిల్లేమో సదగాలని సైకిలెక్కి సక్కా కాలేజీకి పోతింది. ఇంకొక బిడ్డ ఎదిగిన బిడ్డ. ఎదిగిన బిడ్డను యీదిలోకి పొమ్మనే యదవ ఎవుడైనా ఉంటాడా? ఇంక నువ్వుండావు. నేనుండాను. నీకేం మొక్క మాదిరుండావు. కొట్టమంటే వంచిన నడుము ఎత్తకుండా కొట్తావులే బోరింగు. అయినా ఎత్తుకోనొచ్చి పోసుకోవద్దా? ఇక్కడెవురూ లావుగా లంబుగా లేరుగానీ నువ్వు ముందుగా ఆ నాలుగ్గాళ్లమండపం కాడికి పొయ్‌రా!'' అంటా మాబాశాలి నాలుగ్గాళ్లమండపం దాకా దీర్గం తీసె.

''ఇద్దో! యిప్పుడంటే అన్నావు. ఇంకొక సారి అనబాక. నిద్దర లేస్తానే కరిణె బొడ్లో దోపుకోని మా బావ ఆడి దర్మారెడ్డి నాలుగ్గాళ్లమండపం కాడికి పొయ్‌నాడు. ఆ మాటకొస్తే ఈ పొద్దు కార్లల్లో కాలర్లు ఎగరేసుకుంటా తిరగతా వుండే మొగలాయిలంతా వాళ్ల బతుకుల్ను మొదులు పెట్టిందెక్కడో తెల్సా? ఆ నాలుగ్గాళ్లమండపం కాణ్ణే. కలం శాత పట్టేటోణ్ణే! కరిణె శాత పట్టేదానికి నాకేమన్నా గాచ్చారమా?'' అని బీకరానికి అన్నానబ్బా! అంతే-

ఈడ్సి పైట కొంగును నడుమున చెక్కె. చేతిలో ఏందో వుంటే యిసిరట్టా కొట్టె. టేపు రికార్డర్ ఆన్ చేసె!

''అరెరెరె! మొగోడంటే నువ్వేనే! ఇంక ఈ యీదిలో ఈ ఊళ్లో ఈ దేశింలో ఎవ్వరైనా మూతి మింద మీసం వుండాదనే మొగోళ్లుండారా? అద్దో ఆ మండపం కాడగూడా యిద్దురు ఆడోళ్ల ఒక బాశాలి అదే మాట!...నీ మొగుడు ఒకడేనమ్మా కలం బట్టే మొగోడు.'' అని అన్నారు. అట్టాంటప్పుడు నీది గాచ్చారం ఎట్టవితిందే? గొంతులోకి అన్ని మంచి నీళ్లకు నోచుకోని ఈ సీమలో పుట్టిన నేరానికి గాచ్చారం మాదికానీ...''

''పరగడుపన పాలిటిక్స్ ఎత్తుకుంటే ఎట్నే? ఈ దినాల్లో పాలిటిక్స్ అంటే అదొక ఎత్తుబారం మొత్తుకోళ్లు. ఆ ఎత్తుబారం మనకెందుకే? అయినా మీ ఆడపడుచులకు ఏమి తక్కువయిందని? అన్న హయాంలో ఆస్తి హక్కులొచ్చె. దినానికి రొండు సిల్మాలకు బొదులు నాలుగైదుగా చూస్తా ఉండారు. మొగోడు యిట్టా ఆపీసుకు.. పిలకాయిలు అట్టా యిస్కూళ్లకు... మీరిట్టా సిల్మాలకు. ఆ సిల్మాలుగూడా కొత్త కొత్త కొటాయిల్లో అన్న ఎప్పుడో రాముడు కిష్టుడుగా వేషం కట్నె పాతవే గదంటే? – ఇంక మీకు ఏమి తక్కువయిందని గాచ్చారం అంటా ఉండావే?''

అన్నరాజ్జింలో అమ్మలకు అమ్మమ్మలకు అక్క చెల్లిండ్లకు ఏమేమి వొరిగిందో వరస బెట్టి వాగేవాణ్ణే కానీ మా బాశాలి ఎకే ఒక్క చూపుతో బ్రేక్ కొట్టె!....

ఆ చూపు సటపటమైన చూపు గాదు. అలనాడు ద్రౌపతమ్మ దుశ్శాసనుణ్ణి చూసిన చూపు. ఈ పొద్దు రామన్న శీనన్నను చూస్తా ఉండే చూపు. ఆ చూపులకు సుంద్రక పోతా తల వంచుకుంటి.

''ఎట్టమ్మా ఈ తలమాసిన మొగోడ్తో? చెప్తే అర్తం గాదు. చూసైనా నేర్సుకోలేడు. ఆ ఎదురింటోళ్లు పక్కింటోళ్లు రేత్రికి రేత్రే ఏం చెయ్‌పించినారు? ఇంటి ముందర్నే మొల్లోతు గుంతలు లోడిపించినారా? కొళాయిలు అంత కిందికి దింపించేసినారు? ఇప్పుడు చూడు పో. ఈదిలోకి అడుగు పెట్టే పని లేకుండా కడవలకు కడవలు పట్టి పోసుకుంటా ఉండారు!''

ఎలిగె! అప్పిటికి ఎలిగె. టూబులైట్ బెమ్మాండంగా!

అంటే!

''ఒరే మొగోడా! ఆ నాలుగ్కాళ్లమండపం కాడికి పో. కూలోళ్లను పిలుచుకోని రా. ఎదురింటోళ్లు పక్కింటోళ్ల మాదిర్తో ఇంటి ముందరొక గుంత లోడి పించు. కొళాయిని మొల్లోతు కిందికి దింపించు. అప్పుడా కొళాయిలో నీళ్లొస్తే అంత కాపీ కాసి నీ మొకాన కొడ్తా!''

ఇదీ ఆపె మణుసులో మాట. అర్తమయ్యేకుందికి నన్ను యాదన పట్టుకుండె.

''వాడు యిళ్లామార్క్యుడైనా ఆడదాని దగ్గిరికొచ్చే కుందికి ఎందుకింత అడవై పోతాడే? ఏమైనా ఆడదంటే ఆడదే!'' అని ఆలోచించుకుంటా నాలుగ్కాళ్లమండపం కాడికి ఎలబార్నా. మా యింటి కాడి నుంచి నాలుగ్కాళ్లమండపం కాడికి ఎంత దూరం? నడిస్తే నాలుగు నిమిసాలు. పరిగిత్తితే రెప్పార్సినంత సేపు.

ఎంటబడి ఎవురూ నన్ను తరమక పాయ్‌నా నడక పరుగ్గా నడస్తా ఉండా. నాలుగ్కాళ్లమండపం కాడ కొంపలు అంటకపోతా ఉండాయని కాదు. మా బాశాలి ముందు నన్ను పోనిస్తింది. ఎనక నిలబడుకోని చూస్తా ఉంటింది. ఆడ ఎవురికి ఆరక పోలేదని మెల్లింగా నడ్సినానే అనుకో తిరుక్కోని వస్తానే నా నడక్కు పెండ్లి నడకని పేరు పెట్నా పెడ్తింది.

నేను నాలుగ్కాళ్లమండపం కాడికి పోతా వుంటే నా మణుసు అది ఎప్పుడు పొయ్యిందో మా ఊరు చేరుకునేసింది.

ఈడ తిరపతిలో మా ఇంటి ముందర వొక బోరింగు ఉణ్ణెట్టు ఆడ మాఊరి ముందర ఒక బాయి ఉండాది. ఆ బాయి పేరు పెద్ద బాయి. ఆ బాయి ఎప్పుడో పెద్దోళ్ల కాలాన కట్టించిన బాయి. ఆ బాయిని చూస్తా ఉంటే చంద్రగిరి కోటను కట్నోళ్లు కండ్లల్లో మెదల్తారు. కాళాస్త్రిలో గుడి కట్నోళ్లు గుర్తుకొస్తారు. ఏడు కొండల మింద ఎంత దూరం ఎతికినా అటుమంటి రాయి దొరకదు. ఆ చోట్లోనే అటుమంటి రాత్తోనే గుళ్లు గోపరాలు కట్నె మొనగోళ్లు మణుసులో మెదల్తారు.

మా ఊళ్లో మా దాయాదులు మాతో కలుపుకోని నాలుగు యిండ్లోళ్లు. పెద్ద బాయిలో నాలుగిండ్లకు నాలుగు బాగాలు. మా అయ్య చిన్న పిలగాడుగా ఉణ్ణెప్పుడు జమాయించి తోల్తా ఉంటే గూడా ఒక్క చుక్క నీళ్లు తగ్గేవి కాదంట. కీ యిచ్చిన గెడారం నిలవకుండా పోతా ఉణ్ణెట్టు అది కీనీరు బాయి. తోల్తా వుంటే నీళ్లు ఊరతా ఉంటాయి. అట్లాంటిది నేను బుడంకాయంతగా ఉణ్ణెప్పుడు వంతుల కిందికొచ్చె. ఒక్కొక్క దినం వొక్కొక్కరుగా నలుగురు నాలుగు దినాలు మోట గట్టుకుంటా ఉండ్రి.

మా అయ్య తరాన్నుంచి నా తరానికి వచ్చే కుందికి నాలుగింట ఒక బాగం మిగిలిందా? ఆ నాలుగింట బాగాన్ని వంతుల పకారం నాలుగిండ్లోళ్లు పంచుకుంటే మా వంతు కడాన. కడా వంతు గదా? బాయిలో బాన మునిగేది గాదు. ఆ బాయి కింద చేసిన పైరు నీళ్లు లేక ఎండి పోతా వుంటే కడుపట్నే మండి పొయ్యేది!

కడుపు మండినా కండ్లు నిండినా బాయిలో బాన మునగదే?

అందుకే మా అయ్యో మా యన్నో ఎవురో ఒకరు బాయిలోకి దిగతారు. బానకు బానగా ఊర్తా ఉండే నీళ్లను బొక్కిని తోనో బొవ్వాణితోనో దోర్సి దోర్సి ఎత్తి బానకు పోస్తారు. బాన నిండితింది. ఆ బాన నీళ్లు మోట పేరుతో పైకొస్తే పైరుకట్టా తడిబుడింగా తడి బడిందంటే పడేది- ఒక్క యిడుపంతా యిడవకుండా పొరకలాడ్తే!.

ఒక్కొక్క దినం మా అయ్యో మాయన్నో కట్టెకో కంపకో అడివికి పోతారు. అప్పుడు ఏం చెయ్యాలా? – మాయమ్మే బాయిలోకి దిగేది.

ఆ లోతు బాయిలోకి దిగి మొగరాయుడు మాదిర్తో బానకు బానగా ఊర్తా ఉండే నీళ్లను బానకెత్తి పోసిన నా తల్లీ ఆడదే!– ఇంటి ముందరే ఉండే బోరింగులో బిందెడు నీళ్లకొట్టి తెచ్చుకునే దానికి హరిదాసు మాదిర్తో చిందులు తొక్కే మా బాశాలి ఆడదే. యాడుండాదబ్బా దీనికి బిస! అని ఆలోచించుకుంటా నాలుగ్గాళ్లమండపం కాడికి పాయ్‌నా.

పందిని కోసి పొళ్లేస్తా ఉణ్ణెట్టు వొగిటే రంపుగా ఉండాదాడ!

నా చిన్నప్పుడు యిస్కూలికి పోతా పోతా ఆ మండపం కల్లా చూస్తే ఓహో! అంటే ఒక యిర్వై మందికి అట్నో ఇట్నోగా ఉండేవాళ్లు. ఇప్పుడు యిన్నూరు మందికి పైబడే ఉంటారు. ఒకప్పుడు తెల్లంగా గుడ్డలేసుకోని ఎవుడైనా వొకడు ఆడికొస్తే చాలు. కూలికి పిల్సే దానికి వొచ్చినాడనుకోని బొరుగులు చల్తే కాకులు చుట్టుకుణ్ణెట్టు చుట్టుకునే వాళ్లు. ఇప్పుడాడ నిలబడుకోని చూస్తా ఉంటే పలకరించే దిక్కే లేదు.

పలకరించే దిక్కే లేదని పలకరించకుండా అలిగితే పని? మా బాశాలి నా పని పట్టితింది. అందుకే అట్టా యిట్టా చూసినా. ఎవుడో వొకడు. నాలుగ్గాళ్లమండపం పక్కన్నే తీరుబాటుగా నిలబడుకోని టీ తాగతా ఉండాడు. వాడి దగ్గిరికి పాయ్‌నా.

''వస్తావంట్రా అబ్బోడా?'' అని అడిగినా.

''ఏం పని?''

టీ చప్పరిస్తానే వాడు అడగతా ఉంటే వాడి నెట్టు నెటాళం చూస్తా ఉండాది. అయినా అవసరం మనది గదా? అందుకే అన్నీ అణుచుకోని–

''కొళాయికి గుంతలోడి తొట్టి గట్టాల!''

''ఎంతిస్తావ్?''

''ఎంత యియ్యమంటావ్?''

''నాకేమన్నా పెసల్‌గా యిస్తావా? నలగిర్రెకైన పాడేగదా నాది గూడా?''

''అదేగదా నేనడిగేది?''

''మేస్త్రీకి నలబై అయిదు. కూలోడికి యిరవై రొండు.''

నేను నోరు తెర్సినా. నాయంగా వాడి చేతిలో ఉండే కరిణి మట్ట పలకను చూసి బయిపడి నోరు మూసుకోవాల్సింది.

''ఒరే! ఆయిన యిప్పుడే నిద్దర లేసినట్టుండాది. నిద్దర బళ్లిక కూడా యింకా తీరనట్టుండాది. ఆవిలిస్తా ఉండాడు. పాపం! రాత్రంతా బిడ్డ నిద్దర లేకుండా నిలికిలేని సేద్దిం చేసినట్టుండాది.''

ఎవుడో యింకొకడు. వాడి పక్కన్నే నిలబడుకోని ఉండాడు. ఆవుళిస్తే పేగులు లెక్కబెట్టే నాయాలు!–

పెద్దా చిన్నా ఎంచకుండా వాడితో సెతుర్లాడ్తా ఉండాడు.

నా గూబగుయ్ మనింది!

''యాడ రొండు రూపాయిలు. యాడ నలబై అయిదు రూపాయిలు? యాడ ముక్కాలు రూపాయ్? యాడ ఇరవై రొండు రూపాయిలు? అప్పుడు మేస్త్రీకి రొండు రూపాయిలు. కూలోడికి ముక్కాలు రూపాయ్. ఆ కూలి దుడ్లు యిచ్చేవాడు సంతోషంగా యిస్తా ఉండె. తీసుకుణ్ణోడు సుకంకా బతకతా ఉండె.'' అని ఆలోచిస్తా ఉంటే కాలు కదల్లా.

అంతలోనే ముత్తారెడ్డన్న వొచ్చె.

''ఒరే అబ్బోడా! ఎందుకురా అట్ట తలబగల కొట్టుకుంటావ్? సొతంత్రం వొచ్చి నలబై ఏండ్లకు పై బడిందా? కూలి ఇరవై ఇంతలు పెరిగిందా? అయినా యిట్టా యిచ్చేవాడికి సెగితి లేదు. అట్టా తీసుకుండే వాడికి సుకం లేదు. కుండలే గదరా మార్నాయ్. కుండల్లో కూడు మార్తే గదా బతుకులు మార్నెట్టు? నలబై ఏండ్లయినా ఈ సత్తాన్ని తెల్సుకోలేకుండా ఉండారే ఈ ఎర్రి జనం?– ఎప్పుడు తెల్సుకుంటారో అప్పుడు నువ్వు నేను పట్టుకుణ్ణా నిలవర్రా?'' అనె.

నిజింగా నేనూ వొక ఎర్రోణ్ణే గదా? ●